

# సరదా మరద

రాంపా

తెలుగుదనం ఒక్క ఉదుటున రైలెక్కిందా అన్నట్లుగా వుంది. అందులో ముక్కంటి, అమరావతి కూడా వున్నారు. ఆ డబ్బాలో ఓ భారీకాయం విశాలంగా కూర్చుని వుంది.

''ముగ్గురు కూచునే సీట్లో ఒకళ్లే విస్తరించడం ఏమన్నా బావుందా!''

చూసీ చూడనట్లుగా చూస్తూ ఆయనతోపాటు అందరూ వినేట్లుగా అన్నాడు ముక్కంటి.

''ఎందుకండీ గాలికేకలు'' అంది భార్య అమరావతి.

ముక్కంటి కామెంట్ కంటే అమరావతి అరుపు గంభీరంగా వుంది.

ఆ సందర్భంలో నవ్వడం ఏమాత్రం సంస్కారం కాదని తెలిసినా అసంకల్పితంగా నవ్వారు అందరూ.

ఒకతను వశం తప్పి కళ్లలోంచి, ముక్కుల్లోంచి నీళ్లొచ్చిందాకా నవ్వి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

''బాబూ ఈ కంపార్టుమెంటులో వైద్యం తెలిసినవాళ్లెవరన్నా వుంటే కాస్త చేయి చేసుకోండి. యిక్కడో పేషంట్ నవ్వీనవ్వీ ఎక్కిళ్లొచ్చి కళ్లు తేలేశాడు'' మైకులో అనౌన్స్‌మెంట్‌లాగా అరిచాడు ముక్కంటి. విస్తరించడం అన్న పదం అంతపని చేసిందనుకుని.

''అయ్యా ఈ డబ్బాలో కళ్లూకాళ్లూ లేని బిచ్చగాళ్లు, పల్లీ బఠానీలు అమ్మేవాళ్లు, రైల్వే పోలీసులు, టికెట్ చెకింగ్ చేతులు తప్పితే డాక్టర్లు ఉన్నట్టుగా లేరు'' అన్నారెవరో సభలో ఓ ప్రేక్షకుడిలాగా.

''నేనున్నా మూలికావైద్యుణ్ణి'' ఒకాయనన్నాడు మగత నిద్రలోంచి వులిక్కిపడి.

''ఇప్పుడాయనకోసం రైలాపి చుట్టుపక్కల చెట్లెక్కడ పీక్కొస్తాంగానీ, ముందా మొహంమీద కనీసం నీళ్లన్నా చల్లండి'' అని ఓ బామ్మగారు జలచికిత్స చెప్పారు.

''ఈ నీళ్ల డాక్టర్లం చాలామంది వున్నాం'' అంటూ వాటర్ బాటిల్స్ మూతలు తెరుచుకున్నాయి.

నీళ్లు చల్లారో, కుమ్మరించారో తెలియకుండా అతన్ని తడిపేశారు. అతను స్పృహలోకి వచ్చాడు. వణుకుతున్నాడు. ఫాన్లు ఆపేయండీ అని అరిచారొకరు. ఒకాయన అతని చొక్కా విప్పి కటికీలోంచి నీళ్లు పిండి యిక వేసుకో అని యిచ్చాడు. బ్రీఫ్‌కేస్ లోంచి టవల్ తీసి వళ్లు తుడుచుకుని బాత్‌రూంలో కెళ్లి బట్టలు మార్చుకుని వచ్చాడతను. ''యింకా నయం సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుని ఉండలేదు'' అంటూ కూర్చున్నాడు. యింతలో చెప్పులు జరిపి మట్టి తుడిచి అడుక్కునే పిల్లవాడొకడు కిందపడ్డ నీళ్లు శుభ్రంచేసి చేతులు చాచాడు. టకటకా వాడి జేబులు నిండాయి. సాధారణ స్థితి నెలకొంది.

''ఎందుకండీ అంతలా నవ్వారు'' అడిగాడు ముక్కంటి.

''మీరు కాస్త నోరు మూసుకుంటారా'' అరిచింది అమరావతి.

సెల్లతను నవ్వాపుకోలేక పక్కడబ్బాలోకి వెళ్లాడు. అతనితోపాటు తుడిచే పిల్లవాడు కూడా బయల్దేరాడు.

''ఎందుకురా నావెంటే వస్తున్నావు'' అడిగాడతను.

''పక్క డబ్బాలో యింకెంత పెద్దగా నవ్వుతారోనని'' అన్నాడు వాడు.

అందరూ నవ్వారు.

***

''అదేంటోనండి ఒక్కోసారి అర్థంపర్థం లేకుండా నవ్వొస్తుంది. చిన్నప్పుడు స్కూల్లో కూడా అంతే వచ్చేది. టీచర్ కొడుతున్నా సరే నవ్వాపుకోలేకపోయేవాళ్లం'' అన్నాడు ముక్కంటి సభని ప్రారంభిస్తున్నట్లుగా.

''నవ్వు నాలుగు విధాల చేటు'' అన్నాడొకాయన వేరుశనక్కాయలు పొట్లం కట్టిన కాగితం నలిపి బయట పారేస్తూ.

''ఏదైనా అన్వయించుకోవడంలో వుంటుందండీ'' అన్నాడు ముక్కంటి.

''సామెతలు ఊరికే పుట్టలేదండీ'' కొద్దిగా కోపంగా అన్నాడతను.

''ఈరోజు సామెతల్ని మార్చి రాయాల్సి వస్తున్నదండీ'' అదే నిజమైనట్టు చెప్పాడు ముక్కంటి.

''రాసి మీ యింట్లో గోడకి అంటించుకోండి'' ఈసారి ముక్కెర్రచేసి అన్నాడతను.

''యిదన్యాయమండీ'' సరదా గొంతుతో అన్నాడు ముక్కంటి.

''ఏదన్యాయమండీ'' అడిగాడతను.

''గోడ బయట అంటించమని చెప్పొచ్చుగా'' సరదా సాగాలని అన్నాడు ముక్కంటి.

''ఏయ్ మిస్టర్ బాడీ స్వాలెనా, కేర్‌ఫుల్'' అరిచాడతను.

''నాకు యింగ్లీషంతగా రాదు తెలుగులో చెప్పండీ'' అన్నాడు ముక్కంటి.

''అరేయ్ వళ్లు బలిసిందా, జాగ్రత్త'' అన్నాడతను.

''అబ్బ! ఎంత హాయిగా వుందో!'' అన్నాడు ముక్కంటి.

''యిదేవిటండీ బాబూ అడిగి మరీ తెలుగులో తిట్టించుకుంటున్నారు'' సరదాలోకి వస్తూ.

''నీకేం తెలుసు నాయనా తెలుగులో తీయదనం. దేశభాషలందు తెలుగు లెస్స'' అన్నాడు ముక్కంటి.

''నువ్వేమన్నా శ్రీకృష్ణదేవరాయలువా'' అన్నాడతను.

''కాదు. ఆయనన్న మాటన్నానన్నా'' అన్నాడు ముక్కంటి.

''మా కోటి రత్నాల వీణాగానం వింటూ అన్నాడామాట. అది తెలుసో లేదో'' అన్నాడొకాయన.

''ఆయన సీమ రాయలసీమ. అది నీవు మరచిపోయినట్టున్నావు'' యింకొకాయన గొంతు లేపాడు.

''యిద్దరూ పొరబడుతున్నారు. మా తెనాలి రామలింగకవి పలుకులు విన్న తర్వాతే ఆ మాటన్నాడు'' అన్నాడింకొకాయన లేచి నించుని.

''మేము కూచునే మాట్లాడుతున్నాం. మీరేంటి మీ ఎత్తు చూపెట్టుకుంటూ ఎలుగెత్తి చాటుతున్నారు'' అన్నాడు మొదటాయన.

''ఏమిడీ మీరు ఆంధ్రభోజుణ్ణి చూశారా'' అడిగాడు ముక్కంటి.

''లేదు. ఆ వేషం వేసిన ఎన్టీఆర్‌ని చూశాను'' చెప్పాడతను.

''ఆయనిప్పుడున్నాడా''

''లేదు''

''అన్నాయనా లేదు. ఆయనన్నట్లుగా అన్నాయనా లేదు. ఎందుకండీ ఈ గోల'' అన్నాడు ముక్కంటి నవ్వుతూ.

''అలా చెప్పండయ్యాగారూ. తెలుగు మాట్లాడే నాలుగు మూలల్నుంచి వచ్చినవాళ్లం. ఎన్నో ఏళ్లుగా రైళ్లల్లో బొచ్చెపట్టి బతుకుతున్నవాళ్లం. మీరిలా ప్రాంతీయ భేదాలు తీసుకొచ్చి పోట్లాడుకుంటే మా పొట్టలు గడిచేదెట్లా'' అంటూ బిచ్చగాళ్లు వచ్చారు. దాంతో ఎవరికి వారు మూతులు బిగించి కిటికీలోంచి పరుగులు తీస్తున్న గుట్టలకు, పుట్టలకు కళ్లప్పగించారు.


ముక్కంటి తడబడ్డాడు.

వాళ్లు తనను చూసే చెప్పారు. జవాబు చెప్తే యింకోటంటారు. చివరికి తన చర్చావేదిక వాళ్ల తోనే కొనసాగాల్సి వస్తుందేమో అనుకున్నాడు.

అమరావతి కోపంగా చూసింది. ముక్కంటి పట్టించుకోలేదు.

''ఏదో కాలక్షేపానికి మాట్లాడుకుంటున్నాంలే. అది సరే మొత్తం మన దక్షిణ మధ్య రైల్వేలో మీరెం






తమంది వున్నారు. మీ రోజువారీ సంపాదన ఎన్ని వేలల్లో వుంటుంది. రైల్వే ఉద్యోగులకూ మీకు లాకాలూకీలున్నాయా'' అని సూటిగా ప్రశ్న వేశాడు ముక్కంటి, పాత్రికేయుడిలాగా కలం కాయితం బయటికి తీస్తూ. బిచ్చగాళ్లు ఏం చెబుతారా అని అందరూ ఎదురు చూశారు. క్షణంలో చూపుకందకుండా పోయారు వాళ్లు.

ఒక్క ముక్కలో తేల్చేశారే అన్నట్లుగా చూసి మళ్లీ తెలంగాణా బజానా మొదలుపెట్టాడు ఒకాయన.

''చూడండీ మా అమ్మ పుట్టింది తెలంగాణాలో. మా నాన్న ఆంధ్రాలో. గోడలెందుకు కడతారు చెప్పండి. హాయిగా తెలుగువాళ్లం కలిసుందాం'' అంటూ ముగించాడు ముక్కంటి.

''యిదేం రైలండీ బాబో ఆగుతున్నదో సాగుతున్నదో తెలియకుండా వుంది'' అన్నాడొకాయన.

''ఎక్స్‌ప్రెస్ పేరు పెట్టుకున్న పాసింజరు బండి లెండి'' అన్నాడు ముక్కంటి.

''అదికాదండీ. మరీ యింత నత్తని మించిన మెత్తగా పోతున్నదేవిటని'' అన్నాడతను.

ముగ్గురు కూర్చునే సీటు మీద శరీరాన్ని పరిచిన భారీకాయుడు సుమో చిన్నగా నవ్వాడు.

ఆ నవ్వుకే కొంత భయంగా అందరూ అటు చూశారు.

''అరే! మీలో నవ్వే గుణం వుందన్నమాట. అది కావాలండీ ఆరోగ్యంగా కాలం గడపడానికి'' చొరవ చేసుకున్నాడు ముక్కంటి.

''ఏదో పెదవి కదిలించానంతే. నిజంగా నేను నవ్వితే బండి పట్టాలు తప్పుతుంది'' అన్నాడు సుమో.

అందరూ నవ్వారు.

''హమ్మయ్య. మీరు సరదా మనిషేనన్నమాట'' అన్నాడు ముక్కంటి.

''అవునండీ నేను సరదా మనిషినే. మీరు సరదాగా అన్న మాటని సరదాగానే తీసుకున్నాను. అయితే మీకు తెలియని నిజం ఏంటంటే నేను ఎప్పుడు రైలెక్కినా మూడు టిక్కెట్లు తీసుకుంటాను. ఎవరన్నా చిన్నపిల్లలుంటే నామీద కూర్చోబెట్టుకుంటాను కూడా'' అన్నాడు సుమో.

యింతలో ఓ తండ్రి తన పెద్దసైజు చిన్నపిల్లవాణ్ణి నడిపిస్తూ వచ్చాడు.

''పిల్లవాణ్ణి నడిపిస్తున్నారేం. ఎత్తుకోవచ్చుగా'' అన్నాడు సుమో.

''అయ్యబాబో! వీణ్ణి ఎత్తుకుని తిరిగితే రేపు మీ అంతవాడవుతాడని రైల్లో అయినా సరే వాకింగ్ చేయించండని డాక్టర్లంటే పాదయాత్ర చేయిస్తున్నాను'' అన్నాడా అబ్బాయి తండ్రి.

''అవున్లెండి గంటా అరగంటా ప్రయాణం కాదాయె'' అన్నాడు ముక్కంటి మాట కలుపుతూ. అమరావతి చిరాగ్గా చూసి వూరుకుంది.

''నాన్నా ప్రతి డబ్బాలో యిలాంటి లావాటి అంకుల్స్ వున్నారేంటి'' అడిగాడు బాబు.

''అవున్రా బుడ్డోడా మొత్తం ఆరుగురం అన్నదమ్ములం ఒకేచోట కూచోడం బావుండదని డబ్బాకొకళ్లం కూచున్నాం'' చెప్పాడు సుమో.

బుడ్డోడు నవ్వాడు. నవ్వినవాడు ఊరుకోకుండా ''అందుకనమాట రైలింత లేటు'' అన్నాడు.

''ఆర్నీ బుడ్డోడా'' అని పిల్లవాణ్ణి ఒక చేత్తో లేపి ఎత్తుకుని తొడమీద కూర్చోబెట్టుకున్నాడు సుమో.

''అరేయ్! బుడ్డోడా ఒక ముద్దివ్వరా'' అడిగాడు.

''ఎందుకంకుల్! మన శరీరాలు ముద్దులకు దూరం కదా'' అన్నాడు బుడ్డోడు.

''చూశారండీ. ఈరోజుల్లో పిల్లలెంత గడుగ్గాయిలో'' అన్నాడు ముక్కంటి.

అందరూ నవ్వుతుంటే నవ్వి సొమ్మసిల్లిపోయిన సెల్లాయన వచ్చాడు. పాపం ఎందుకో మొహంలో నెత్తురు చుక్క లేకుండా వున్నాడు.

''ఏవిటండీ అలా వున్నారు'' అడిగాడు ముక్కంటి.

''మీరే ఏదన్నా జోకేయండి'' అన్నాడొకతను.

''వామ్మో వద్దండో. యిక్కడుంటే ఎందుకో వెర్రి నవ్వు ఆపుకోలేకపోతున్నానని పక్క కంపార్టుమెంటులో కూర్చున్నానండీ. సెల్లు ఛార్జింగ్ పెట్టాను. అంతే క్షణంలో ఛార్జరు మిగిలింది సెల్లు పోయింది'' చెప్పాడు దిగులుగా.

''మీ సెల్లు కొట్టేసిన ఆ దొంగవెధవ దొరికితే కీళ్లు విరగ్గొట్టాలి'' అన్నాడు ముక్కంటి.

''దొంగ కాదండి బాబో అది పడింది నీళ్లలో. నాఖర్మగాలి అప్పుడే రైలు బ్రిడ్జిమీద నుంచి దాటుతోంది'' అన్నాడు.

''పోన్లెండి, పోయింది మంది కాదనుకోండి'' అన్నాడు ముక్కంటి ఓదార్చుతూ.

''అసలిదంతా జరిగింది మీవల్లనే. మీరీ లావాటాయన మీద జోకేయబట్టే'' అన్నాడు సెల్లతను.

''హమ్మయ్య యిన్నాళ్లకి నా జోక్కి నవ్విన వాడొకడు దొరికాడు'' అన్నాడు ముక్కంటి.

''నిజంగా నేను నవ్వింది మీ ఆవిడ మిమ్మల్ని అరవడం చూసి'' అన్నాడు సెల్లతను.

''అయితే మీ సెల్లు పోవడానికి మా ఆవిడ కారణమంటారా'' అన్నాడు ముక్కంటి.

''కాదు, మీరేనని చెప్పానుగా'' అన్నాడు సెల్లతను కోపంగా.

''అయితే ఏం చేయమంటావు'' అన్నాడు ముక్కంటి.

''మీరేం చేస్తారో నాకు తెలియదు. మీరు నాకు సెల్లివ్వాల్సిందే'' అన్నాడతను.

ఒక్కసారి ఫటఫట మంటూ రైలాగింది.

ముందెవరో మందుపాతర వుందని చెప్పడంతో జనాలు గగ్గోలు పెడుతూ అసలేం జరిగిందో తెలియక కొందరు దిగారు. కొందరు దూకారు రైల్లోంచి.

***

''అందుకనే నోరు మూసుకుని ప్రయాణం చేయండీ అని మొత్తుకునేది'' అంది అమరావతి.

''యిప్పుడేమయిందోయ్. క్షేమంగానే యింటికి చేరుకున్నాంగా'' అన్నాడు ముక్కంటి.

''ఏదో మందుపాతర దయవల్ల బతికిపోయాం గానీ, లేకపోతే మీ సొల్లు వాగుడుకి సెల్లు చెల్లించుకోవాల్సి వచ్చేదే'' అంది అమరావతి.

''యింట్లో ఎలాగూ మాట్లాడలేను. నలుగురిలోకి వెళ్లినప్పుడు నోరు నొక్కుకోవడమేనా'' గొణిగాడు ముక్కంటి.

''అదేదో మైకు పట్టుకుని సోదర సోదరీమణులారా అంటుంటారుగా అప్పుడప్పుడూ అది చాలు మీకు'' అంది.

''మైకు లేనప్పుడు కూడా సరదాగా మాట్లాడ్డంలో ఓ మైత్రీ భావం వుంటుంది. అదో కళ. యిక్కడే నీవు కళాకారుణ్ణి అర్థం చేసుకోవడం లేదు'' అన్నాడు.

''ఓ పని చేయండి. అమీర్‌పేట మైత్రీవనం పక్కన రోడ్డు కనపడకుండా పాంప్లెట్లు పడి వుంటాయిగా. అవన్నీ కుప్పచేసి ఆ కుప్పమీదెక్కి గొంతు చించుకోండి. కంప్యూటర్ కోర్సులకొచ్చిన పిల్లలకు కాలక్షేపంగా వుంటుంది'' అంది.

''హేళన''

''ఏమన్నా అనుకోండి. ప్రయాణంలో నోరెత్తనని ప్రమాణం చేస్తేనే మీతో ప్రయాణం చేస్తా. అంతే'' కరాఖండిగా చెప్పింది అమరావతి.

***

తండ్రి షష్టిపూర్తి కావడంతో ముక్కంటి వెంట

ప్రయాణం తప్పింది కాదు అమరావతికి. చాలా తెలివిగా అర్థరాత్రి బస్సు టికెట్ రిజర్వు చేయించింది.

బస్సు కదలడంతో అందరూ నిద్రలోకి వెళ్లారు.

ఎప్పుడు లేచాడో తెలియదు డ్రైవరు పక్కన చిటికెనవేలు చూపిస్తూ నించున్నాడు ముక్కంటి.

డ్రైవరేం అనుకున్నాడో ముక్కంటేం చెబుతున్నాడో వినపడ్డం లేదు.

అద్దంలోంచి కనబడుతోంది.

ఓ అరగంట తర్వాత దారి మధ్యలో డాబా దగ్గర బస్సాపాడు డ్రైవర్. దిగీ దిగగానే దిగిన వాళ్లందరూ తన భర్తని అరవడం, కసరడం విన్నది అమరావతి. తర్వాత తెలిసింది డ్రైవర్ దారి మారాడని!

***

''ఏంటమ్మా అప్పుడే తిరుగు ప్రయాణం అవుతున్నారు'' అడిగాడు తండ్రి.

''మీకు తెలుసుకదా నాన్నా, అక్కడ మా యిల్లు ఎక్కువ రోజులు వదిలిపెట్టి వచ్చేట్లు లేదు'' చెప్పింది అమరావతి.

''షష్టిపూర్తి చాలా సరదాగా చేయించారు. మళ్లీ మాకు పెళ్లిరోజులు గుర్తు చేశారు. ఎంతైనా అల్లుడుగారు సరదా మనిషి! ఏంటండీ అల్లుడుగారూ మౌనం వహించారు'' గాభరాపడ్డాడు మామగారు.

''.........''

''అదేవిటే అమ్మాయి, అల్లుడుగారి నోట్లోంచి గాలేగానీ శబ్దం రావట్లేదు'' అడిగాడు తండ్రి.

''ఏంలేదు నాన్నా. ఆయనకిష్టమైన మీగడలో కొంచెం ఫెవికాల్, ఫెవిక్విక్ కలిసిందిలే'' అంది అమరావతి.

''ఆఁ'!'' అంటూ అల్లుణ్ణి దగ్గరకు తీసుకున్నారు మామగారు.

★

## ఐడల్ ఛాయిస్

ఇప్పుడీ ఫొటోలో కనిపించే ఇండియన్ ఐడల్స్ వారిలో వారే ఒకరికొకరు అభిమానులు. ఇటీవల నిర్వహించిన ఓ కంటెస్ట్ సందర్భంగా జరిగిన ఇంటర్వ్యూలో మీ అభిమాన గాయకుడెవరు అని అడిగినప్పుడు ఇద్దరూ సిగ్గుపడుతూ ఒకరినొకరు పొగుడుకున్నారు. రాహుల్ అమీని ఏమంటున్నాడంటే: 'అమీ చాలా అందగాడు. అందుకే అమ్మాయిలంతా అతనంటే పడి చస్తారు. అంతేకాదు, అతనిలో అపారమైన తెలివితేటలు, ప్రతిభ దాగివున్నాయి' అని కితాబిచ్చాడు. అమీ రాహుల్‌ని ఏమంటున్నాడంటే: 'రాహుల్ చిన్నప్పటినుంచి నాకు తెలుసు. అంతేకాదు; మేమిద్దరం కలిసే సురేష్ జీవాడ్కర్ దగ్గర గురుశుశ్రూష చేశాం. ఇప్పటి తరం వారందరిలోనూ అతను ఆణిముత్యంలాంటివాడు. రాహుల్ లాంటివారు ఇండస్ట్రీలో చాలా కొద్దిమందే వుంటారు' అలాంటిది మా మధ్య పోటీ ఏంటి?' అంటున్నాడు.

